www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 22 సెప్టెంబర్ 2024



ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పీలేరు

జిల్లాలోని ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో పీలేరు పరిసరాల్లోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆశలు విధి నిర్వహణలో ఎదురైన ఇబ్బందులు, సమస్యలు తెలుసు కుని తమ పరిధిలో పరిష్కారం అయ్యే వాటిని పరిశీలిస్తామని, మిగిలిన వాటి పరిష్కారం కోరుతూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డిసిఎంలు సుగుణ, విజయ్, హెచ్ఇ ఉషారాణి, సూపర్‌వైజర్ మహ్మద్ బాషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ కొండయ్య

కానరాని చినుకు..కర్షకుడిలో వణుకు!

- కష్టాలమయంగా వేరుశనగ సాగు
- నీరందక ఎండుతున్న పంట
- ట్యాంకర్లతో పంటకు నీటి తడులు
- భారీగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడులు రాని వైనం
- ఆందోళనలో రైతులు

వర్షాభావంతో పూర్తిగా ఎండిపోయిన వేరుశనగ పంట

ప్రజాశక్తి-కలికిరి

వేరుశనగ పంట ఎండుముఖం పడుతోంది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగా మెట్ట భూముల్లో వేరుశనగ సాగు చేసిన రైతాంగానికి లోటు వర్షపాతం తీరని నష్టాన్ని మిగిల్చింది. అదునులో పదును వాన కురవక పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. కలికిరి మండల పరిధిలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 750 ఎకరాలు కాగా ఈ ఖరీఫ్‌లో సగానికి సగం మాత్రమే సాగింది. సాధారణ సాగులో 50 శాతం పంట నష్టం వస్తుండడంతో రైతులు సాగు చేయడానికి ఆశక్తి చూపడం లేదు. నాలుగైదు సంవత్సరాలుగా రైతులు వేరుశనగ పంట వేయడానికి నిరాశక్తి వ్యక్తం చేస్తున్నారు. అతివృష్టితో ఒకసారి అనావృష్టితో ఒకసారి వెరసి రైతులు ప్రతి సంవత్సరం నష్టాలు బారిన పడి అప్పుల పాలు అవుతున్నారు. వేసిన పంటలకు కూడా ఆరకోర వర్షానికి ఎండుతూ పండిన పంట దిగుబడి పడిపోవడంతో పాటు ఒబ్బిడికి వర్షం కురవక రైతులు ట్యాంకర్లతో నీటిని పిచికారి చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సకాలంలో వర్షాలు కురువకపోవడంతో వంద రోజుల్లో ఒబ్బిడి చేయాల్సిన వేరుశనగ 140 రోజులు దాటినా చేతికి అందక పోవడం, ట్యాంకర్లతో నీటిని తోలి పంటను ఒబ్బిడి చేస్తున్నారు. ఇలా చేయడంతో ఎకరానికి నాలుగైదు వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావంతో అరకొరక పండిన పంట నూర్పిడికి రైతులకు తిప్పలు తప్పడం లేదు. చేతికొచ్చిన పంటను సకాలంలో ఒబ్బిడి చేయడానికి పదును వాన కరువైంది. ఎండిపోతున్న వేరుశనగ మొక్కలను తీయడానికి రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. వర్షాభావంతో విత్తన కాయలు నాణ్యత కూడా పూర్తిగా లోపించి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ట్యాంకర్లతో నీటి తడి అందించడానికి ఎకరానికి 6 నుంచి 7 ట్యాంకర్లు నీరు అవసరమని రైతులు వాపోతున్నారు. మోస్తరుగా ఉండే రైతులు కొంతమంది డబ్బులు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా పిచికారి చేయడంతో అంతంత మాత్రంగా పండిన పంట నూర్పిడికి అదనంగా నాలుగైదు వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని, ట్యాంకర్లతో నీటిని పిచికారి చేయడం తో అంతర పంటలు దెబ్బతిని, ఆదాయం కూడా కోల్పోవాల్సి వస్తుందని, ఎకరాని ఐదు బస్తాలు లోపే దిగుబడి రావడంతో పెట్టుబడి ఖర్చులు చేతికి రావడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి లేదంటున్న మహిళా రైతు

నష్టాలు పాలవుతున్నాం

వేరుశనగ పంట సాగు చేస్తుండటంతో అధికంగా నష్టాలు పాలవుతున్నాం. వర్షాలు సకాలంలో పడక పోవడంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. సకా లంలో వర్షాలు కురువకపోవడం వలన వేరుశనగకాయలు నాణ్యత లోపించాయి. కొనుగోలుదారుల ఆసక్తి చూడడం లేదు.

- ఎస్ కమలాకర్, రైతు, గుట్టపాలెం.

వేరుశనగ సాగుకు ధైర్యం చాలడం లేదు

ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ సాగుకురు రూ.30 వేలు ఖర్చుయింది. వర్షాలు లేక మొక్కకు ఐదారుకాయలే ఉన్నాయి. ఎకరానికి ఐదు బస్తాలు దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. పంట ఒబ్బిడికి ట్యాంకర్లతో నీరు పిచికారి చేయాల్సి వస్తుంది. అదనంగా ఖర్చు వస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- జనార్దన్ గౌడ్, రైతు, మేడికుర్తి.

ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి

- 1,94,788 ఎకరాల్లో పంట నమోదు
- 30న తుది జాబితా ప్రకటన

ప్రజాశక్తి-రాయచోటి

ఖరీఫ్‌కు సంబంధించిన పంటల ఇ-క్రాప్ ప్రక్రియ నమోదు ఈ నెల 23వ తేదీతో ముగుస్తుంది. ఆగస్టు 2వ తేదీ నుంచి దీనిపై ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇ-క్రాపింగ్ ఉంటేనే రైతులకు పంట పరిహారాలు, సబ్సిడీలు, ఇతర సదుపాయలు అందుతాయి. గ్రామాల్లో ఏ పంటలు వేశారో వాటిని ఇ-క్రాప్ చేయించుకోవాల్సిఉంది. ఈ ప్రక్రియతో రైతులు సాగు చేసిన పంటల వివరాలు పూర్తి సమాచారంతో వ్యవసాయ అధికారుల వద్ద ఉంటుంది. జిల్లాలో ఖరీఫ్ పంటలకు సంబంధించి సాధారణ విస్తీర్ణం 1,98,203 ఎకరాలు ఉండగా, సాగు చేసిన విస్తీర్ణం 37,947.5 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా 89,413 మంది రైతులకు వ్యవసాయ అధికారులు ఇ-క్రాప్ నమోదు చేశారు. 99.8 శాతం చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ శాతం నమోదు చేశారు. దాదాపుగా సాగు చేసిన ఖరీఫ్ పంటలన్నీ ఇ-క్రాప్ నమోదు పక్రియ వేగవంతంగా పూర్తి చేశారు. గత ఏడాది చాలా మంది రైతులకు సాంకేతిక పరిహారాలు లోపాలతో పరిహారాలు అందలేదనే ఆరోపణలున్నాయి. గతంలో పంటల బీమా పరిహారం చాలా మందికి అందలేదనే అనేకమంది రైతులు ఫిర్యాదులు చేశారు. వ్యవసాయశాఖ అధికా రులు జిల్లాలో ఇ-క్రాపింగ్ నమోదు పక్రియను పూర్తి చేశారు. ఈ నెల 30వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తారు. రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ఉంచారు. రైతులు వెళ్లి తమ పంటలు, పేర్లు పూర్తి వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు చెబుతున్నారు.ఏమైనా లోపాలుంటే ఈ నెల 25, 26వ తేదీల్లో అభ్యంతరాలు ఉంటే సవరించుకోవచ్చు.

ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న చంద్ర నాయక్ (ఫైల్ ఫొటో)

రైతుందరికీ పరిహారం అందిస్తాం

జిల్లాలోని రైతులందరికీ ఇ-క్రాప్ నమోదు చేసి చేయించి ప్రభుత్వం నుంచి రావాల్సిన పంట పరిహారం, సబ్సిడీలు, ఇతర సదుపాయాలు అందించదానికి కృషి చేస్తున్నాం. తుది జాబితా ప్రకటించాక మార్పులు చేర్పులకు అవకాశం ఉండదు. ప్రస్తుతం అన్ని గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో ఈ జాబితాలను రైతులు పరిశీలన కోసం ఉంచాం. ఏదైనా అభ్యంతరాలుంటే కింద స్థాయిలో తమ వ్యవసాయశాఖ సిబ్బంది దృష్టికి తీసుకుపోపోయి సరిచేసుకోవాలి.

- చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, రాయచోటి.

సంక్షోభంలోనూ సంక్షేమం : మంత్రి 'మండిపల్లి'

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి -సంబేపల్లి (రాయచోటి)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆర్థిక సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందిస్తున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంబేపల్లి మండలంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజా వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఎన్నో సవాళ్ళు, ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, వారందరికీ న్యాయం చేస్తూ ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేసుకునేందుకు నేడు వందరోజుల పండుగను ప్రజల మధ్య జరుపుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ప్రజలు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుఖ సంతోషాలతో జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాకుండా సాధ్యం కానివి కూడా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో భాగంగా పేద ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలనే ఉద్దేశంతో చెప్పిన మాట ప్రకారం పెన్షన్ మొత్తాన్ని పెంచి లబ్ధిదారులు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాపితంగా అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించామని చెప్పారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసి రైతులను ఆదుకున్నామని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు వారికి ఐదు నుంచి పది లక్షల వరకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అక్టోబర్ 1 నుంచి నాణ్యమైన మద్యం విధానాన్ని అమలులోకి తీసుకొస్తారన్నారు. అనంతరం మంత్రి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రంగస్వామి, డిపిఒ ధనలక్ష్మి, హౌసింగ్ పీడీ శివయ్య, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ కనీస వసతులు

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ కనీస వసతులైన సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లి మండలంలోని సంబేపల్లి - బొగ్గులవారిపల్లె, బొగ్గులవారిపల్లి - అంబేద్కర్ నగర్ వరకు రూ.కోటితో మంజూరైన సిమెంటు రోడ్డు పనులనుప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. గతంలో రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందన్నారు.టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో పర్యటించి మంచి నీటి సమస్య పరిష్కరిస్తున్నామని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. .ఈ సందర్భంగా బొగ్గులవారిపల్లి గ్రామస్తులు మంత్రిని పూలమాలతో స్వాగతం పలికారు.

'ఇది మంచి ప్రభుత్వం'ను విజయవంతం చేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 26 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, మండల స్పెషల్ అధికారులు, మండల సర్వేయర్లతో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 వరకు సచివాలయ పరిధిలోని ప్రతి గ్రామంలో, పట్టణాల్లోని వార్డుల్లో కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా 100 రోజుల్లో ప్రభుత్వం ఏమి సాధించింది, ఏ విజయాలు అందుకుంది, ఏ విధంగా ముందుకు వెళుతోంది ఆయా రంగాల పట్ల ఆలోచనలు ఏమిటి అన్నవి ప్రజలతో పంచుకోవాలన్నారు. అదే వేదికల్లోనే ప్రజల ఆలోచనలు తీసుకొని వారి అభిప్రాయాలను ఈ పోర్టల్ యుఆర్ఎల్‌లో ప్రజల సూచనలు సలహాలు అప్‌లోడ్ చేయించాలన్నారు. ఇందుకు సంబంధించిన పాంప్లెట్లు, స్టిక్కర్లు జిల్లా వ్యాప్తంగా పంపించామన్నారు. వాటిని ప్రతి ఇంటికి తప్పనిసరిగా చేర్చాలన్నారు. మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు షెడ్యూల్ ప్రకారం ప్రజా దర్బార్ నిర్వహిస్తారన్నారు. జిల్లా అంతట గ్రామ వార్డు సచివాలయ పరిధిలో ఈ గ్రామసభలను నిర్వహించి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలను వివరించాలన్నారు. 2047లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందాలనే విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకుంటారని చెప్పారు. అనంతరం వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణరావు, జడ్‌పి డిప్యూటీ సిఇఒ, సర్వే శాఖ ఏడీ, జిఎస్డబ్ల్యుఎస్ అధికారి, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పంచాయతీ సెక్రటరీలు, మండల స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19వ తేదీ నుండి జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో తమ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో ఎంపికైనట్లు తెలిపారు. శనివారంతో ముగిసిన ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలలో బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో కౌశిక్, ఎస్.అస్లాం, అండర్-14లో ఎస్.సాధిక్, అండర్-17లో షటిల్ బ్యా డ్మింటన్‌లో కౌశిక్, ఎస్.అస్లాం, అండర్-14లో సాధిక్, అండర్-14లో 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో వి.సంతోష్, తృతీయ స్థానంలో పి.ఇర్ఫాన్‌ఖాన్, 200, 100 మీటర్ల పరుగు పందెంలో అండర్-14 బాలికల విభాగంలో ఎస్.ఫాతిమా నస్రీన్, అండర్ 14 బాలుర విభాగంలో 200 మీటర్ల పరుగు పందెం లో ఎస్.షఫీ ప్రథమ స్థానంలో నిలవగా ఎం.కార్తీక్ ద్వితీయ స్థానంలో రాణించినట్లు తెలిపారు. అండర్-14 బాలికల చెస్ పోటీల నందు ద్వితీయ స్థానంలో వినయన, అండర్-14 బాలుర వాలీబాల్ పోటీలలో హేమంత్, అండర్-17లో సంజయ్ ఎంపికైనట్లు తెలిపారు. అండర్-17 కబడ్డీలో పార్థు, మస్తాన్, సిద్దేశ్వర్, నవీన్, చరణ్ తేజ, సల్మాన్, మహేష్, అండర్-14 విభాగంలో సంతోష్, భాను ప్రకాష్, శివ హర్ష, హేమంత్, ఇర్ఫాన్ ఖాన్, ఆశిష్, కైఫ్ రన్నర్స్‌గా నిలిచారన్నారు.

మతిమరుపుపై అవగాహన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

శనివారం ప్రపంచ మతిమరుపు దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని మూరేవాండ్లపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 21న ప్రపంచ మతిమరుపు దినోత్సవం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మతిమరుపు వ్యాధి డెమెషియా అనే మానసిక వ్యాధిలో భాగమన్నారు. ఈ వ్యాధి వచ్చిన వారిలో జ్ఞాపక శక్తి కోల్పోవడం, ఆలోచన శక్తి తగ్గిపోవడం, గుర్తుంచుకోవడంలో సమస్యలు వస్తాయన్నారు. మంచి పౌష్టికాహారం, ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, నీరు, సరైన నిద్ర, సెల్ ఫోన్ వాడకం తగ్గించుకోవడం వలన మతిమరుపుకు గురి కాకుండా ఉండవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పుష్ప, ఎఎన్ఎం రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

29న నూతన కోర్టు భవనం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

ఈ నెల 29న కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని చిత్తూరు జిల్లా పోర్టు పోలియో హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ ప్రారంభోత్సవం చేస్తారని 2వ అదనపు జిల్లా జడ్జి బి.అబ్రహం తెలిపారు. 2వ అదనపు జిల్లా కోర్టులో శనివారం సాయంత్రం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 29న జరిగే నూతన కోర్టు భనం ప్రారంభోత్సవం కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లుపై పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శిరీష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సహాయ అగ్నిమాపక అధికారి పురుషోత్తం, రహదారులు, భవనముల శాఖ డిఇ కంబగిరి, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధికి రూ.87,500 వితరణ

ప్రజాశక్తి-పీలేరు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) పీలేరు శాఖ రూ.87,500 ఇతోధిక సాయం అందించింది. పీలేరు ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ పి.చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ వై.పవన్ కుమార్, కోశాధికారి డాక్టర్ బి.ఈశ్వరసురేంద్ర శనివారం పీలేరులో శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి తాము అందిస్తున్న విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఐఎంఎ కార్యవర్గం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేసిందని, అందులో భాగంగా స్టేట్ ఐఎంఏ పిలుపు మేరకు పీలేరులో 35 మంది దాతలు ముందుకు వచ్చి రూ.2,500 చొప్పున మొత్తం రూ.87,500 స్టేట్ సైక్లోన్ రిలీఫ్ ఫండ్‌కు విరాళం జమయ్యేలా చెక్కును ఇచ్చామన్నారు. బాధితులకు ఆపన్న హస్తం అందించినందుకు ఎమ్మెల్యే పీలేరు ఐఎంఏ శాఖను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ ఇఒ గురు మోహన్, టిడిపి మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రాయచోటి

ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అపరాధ రుసుం రూ.200 చెల్లించి ఈనెల 28 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాశ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు అడ్మిషన్ ఫీజు ఈనెల 30 వరకు ఆన్ లైన్ లో చెల్లించవచ్చు అన్నారు. జిల్లాలోని డ్రాప్ ఔట్ స్టూడెంట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ నందు చేరగలిగే వయసు ఉన్న 754 మంది డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు మండలంలో పాఠశాలల వారిగా మండల విద్యాశాఖాధికారులు వద్ద ఉందన్నారు. ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌లు ఈవిషయాన్ని విరివిగా ప్రచారం చేసి అందరూ ప్రవేశాలు పొందేలాగా ప్రయతించాలన్నారు.

నవయుగ వైతాళికుడు 'గురజాడ'కు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అభ్యుదయ కవితా పితామహుడు రచయిత, సంఘ సంస్కర్త, తెలుగు బాషా మహాకవి గురజాడ అప్పారావు జయంతిని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలోని సాంఘీక దురాచారాలపై తన కలంతో గళమెత్తిన అభ్యుదయవాది, గొప్ప మానవతావాది గురజాడ అప్పారావు అని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రి, ఉపాధ్యాయులు తారాదేవి, నాగేశ్వర రావు, నాగరాజ, శంకర, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** పట్టణంలో గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురజాడ 162వ జయంతి సందర్భంగా స్థానిక జౌళి బజారులోని సరస్వతి విద్యా మందిరంలో వారి చిత్రపటానికి సమితి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు గంగనపల్లి వెంకటరమణ, బొట్టా రామచంద్రయ్య నాయుడు, బి.వి. నారాయణరాజులు మాట్లాడుతూ ప్రజలందరికీ అర్థమయ్యే జీవ భాషలో రచనలు చేసి వ్యవహారిక భాషకు వన్నె తెచ్చిన మహానుభావుడు గురజాడ అని పేర్కొన్నారు. అభ్యుదయ కవితా పితామహుడుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న గురజాడ ఆధునిక భాషలో నూతన ఒరవడిని సృష్టించి కవి శేఖర బిరుదును పొందిన ఘనాపాటి అని శ్లాఘించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ వేత్తలలో గురజాడ ఒకరని, ఈనాటికీ ఆయన రచనలు ప్రజల మన్ననలను పొందు తున్నాయని, ఆయన రచనలు రాశిలో తక్కువైనా వాసికెక్కినవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యా మందిరం పాఠశాల ఉపాధ్యాయినులు పుష్పలత, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లి :** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా గురజాడ జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ భావజా లంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీ యులలో గురజాడ అగ్రస్థానంలో ఉంటారని పేర్కొన్నారు. గురజాడ జయంతి తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోష మన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు, తెలుగు భాష అధ్యాపకులు డాక్టర్ తాళంబేడు సాయి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ జనోదరణకై, మూఢవిశ్వాసాల నిర్మూలనకై తెలుగును వాడుక భాషగా చేయుట కొరకు గురజాడ చేసిన కృషి అనన్య మన్నారు. గురజాడ రచించినటువంటి దేశభక్తి, పూర్ణమ్మ, కన్యక, ఆణిముత్యాలుమొదలైన గేయాలను రాగయుక్తంగా ఆలపించారు. సాహిత్యం ద్వారా చైతన్యం తెచ్చేందుకు గురజాడ విస్తృతంగా కృషి చేశారన్నారు. కళాశాల ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సేగు రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ గురజాడ సాహిత్యం కృషిని కీర్తించారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ గురజాడ చిత్రపటానికి పూలదండలో వేసి ఆయన్ను స్మరించుకున్నారు.

ఇసుకేదీ!

ప్రజా'దృష్టి'

ఉమ్మడి జిల్లాను ఇసుక కొరత వేధిస్తోంది. ఫలితంగా తెలుగుగంగ ప్రాజెక్టు కాల్వల బ్రిడ్జి పనుల దగ్గర నుంచి ఇతర సాగునీటి ప్రాజెక్టుల పనులు ఆగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎన్‌డిఎ కూటమి నాయకత్వం ఎంతో ఆర్భాటంగా ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆచరణలో ఐదు రకాల పన్నులతో కలిపి వైసిపి హయాం తరహాలో వసూలు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీకి ఆచరణకు పొంతన లేవడం ఎన్‌డిఎ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని తేటతెల్లం చేసింది. ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామన్న హామీని అమలు చేసి నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో నెలకొన్న తీవ్ర ఇసుక కొరత నేపథ్యంలో అభివృద్ధి పనులు నేలచూపులు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. టిప్పర్ ఇసుక నిమిత్తం రూ.20 వేల నుంచి 28 వేల వరకు ముట్టజెప్పాల్సి వస్తోందనే వాదన వినిపిస్తోంది. కర్నాటక రాష్ట్రంలోని తదితర ప్రాంతాల నుంచి అన్నమయ్య జిల్లాలోకి ఇసుక అక్రమార్కులు ప్రభుత్వ నిర్దేశిత ధరకు తక్కువగా రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేలకు తరలించి భారీగా సొమ్ము చేసుకోవడం గమనార్హం. కడప జిల్లాలో ఇసుక అక్రమ తరలింపులో అధికార పార్టీ నేతలు చేతివాటం బాహాటంగానే ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర నాయకత్వం ఇసుక అక్రమ రవాణాకు పాల్పడొద్దని చెబుతూనే, ఇసుకాసురులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తోంది. ఫలితంగా జిల్లాలో అక్రమ మైనింగ్ హద్దూపద్దూ లేకుండా సాగుతోంది. కడప జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిపోతోంది. కడప జిల్లాలో రైల్వేకొండాపురంలో రెండు రీచ్‌లు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండల పరిధిలోని ఆర్.బుడుగుంటపల్లి ఇసుక రీచ్‌లను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇటీవల విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అట్టహాసంగా ఎపి శాండ్ పోర్టల్‌ను ప్రారంభించారు. జిల్లాలో కూడా మాత్రమే ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని కల్పించారు. ఎపి శాండ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లబ్ధిదారులకు ఇసుకను సరఫరా చేయడానికి కసరత్తు జరుగుతోంది. కడప జిల్లాలో ఒకవైపు ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు నెలకొనడం, మరోవైపు తాజాగా ఆన్‌లైన్ సర్వర్ సమస్య నెలకొనడంతో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వం సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, సామాన్య ప్రజానీకానికైనా కనీసం ఉచితంగా ఇసుకను సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

హైకోర్టు జడ్జికి స్వాగతం పలుకుతున్న ఆలయ పూజారులు

సౌమ్యనాథుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి కడప జిల్లాలో చారిత్రాత్మక దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. వీరి వెంట విశ్రాంత రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సీతారామమూర్తి దంపతులు, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, నందలూరు కోర్టు మేజిస్ట్రేట్ భార్గవి, రాజంపేట స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్, నందలూరు కోర్టు సూపరింటెండెంట్ రమేష్, టిటిడి ఇన్స్పెక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులతో ఉపాధ్యాయుడు రమణ

క్షేత్ర పర్యటనలు విజ్ఞానానికి పునాదులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం పరిసరాల విజ్ఞానం లో వ్యవసాయం పాఠ్య భోదనలో భాగంగా ఉపాధ్యాయులు రమణ విద్యార్థులను దగ్గరలోని పంట పొలాల దగ్గరకు క్షేత్ర పర్యటనకు తీసుకు వెళ్లారు. ఒక పంట పండించటానికి రైతు పడే కష్టాన్ని , పంట పొలాలకు నీటి పారుదల కోసం వాడుతున్న డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ వ్యవసాయం లాభాలను విద్యా ర్థులకు వివరించారు. రసాయనిక మందుల వాడకం వల్ల కలిగే నష్టాలు, కంపోస్ట్ ఎరువులు,వర్మీ కంపోస్ట్, మొక్కల ఉపయోగాలు, తల్లి వేరు వ్యవస్థ, పీచు వేరు వ్యవస్థ, పుష్పములోని భాగాలు ఇలా అనేక అంశాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. నేటి రోజుల్లో వ్యవసాయం గురించి విద్యార్థులకి వివరించేయడం చాలా ముఖ్యమని, ప్రకృతి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని రైతులు పేర్కొన్నారు.

హార్సిలీహిల్స్ టోల్‌గేట్

ముగిసిన టోల్ గేట్ వసూలు గడువు

- వేలం పాట పకడ్బందీగా నిర్వహించాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ప్రవేశ వసూలు చేసే టోల్ గేట్ కాలపరిమితి ముగిసింది. గత కొన్ని రోజులుగా బి.కొత్తకోట రెవెన్యూ అధికారులు ప్రస్తుతం టోల్ గేట్ రుసుమును వసూలు చేస్తున్నారు. ఈనెల 28వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో 2022-2023కు పలికిన వేలం ధర కన్నా 2023-24 సంవత్సరానికిగాను రూ.50వేలు ఎక్కువ ధర నిర్ణయించి రూ.27.43 లక్షలకు అప్పటి ఆర్‌డిఒ ఎం.ఎస్.మురళి సహాయంతో మరల గత టెండరుదారుడికే టెండర్ వచ్చేవిధంగా కృషి చేశారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఈసారైనా టెండరుకు వచ్చే వారి సంఖ్య పెంచేలా, తద్వారా పెంచి హార్సిలీహిల్స్ అభివృద్ధికి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేపు రెండు పాఠశాలల్లో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని గుట్టవాళ్లపల్లి వెంగమారాజుగారిపల్లి ప్రాథమిక పాఠశాలలలో సోమవారం పాటు గుట్టవాళ్లపల్లి అంగన్వాడీ సెంటర్ లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఉపాధ్యాయుడు నాయుడు డాక్టర్ యర్రపురెడ్డి శరత్‌గిరిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి సుండు పల్లి మాజీ సర్పంచ్ నిర్మలమ్మ వర్ధంతి సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిర నిర్వహి స్తున్నామని చెప్పారు. ఈ శిబిరంలో సుండుపల్లె తిరుమల మెడికల్ స్టోర్ రమేష్ ఆచారి కుమార్తె డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో దంత చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-చిన్నమండెం

విద్యార్థినికి పలకను అందిస్తున్న శ్రీరాములు

మండల పరిధిలోని కురవపల్లి ఎంపిపి స్కూల్ విద్యార్థులకు శనివారం చిన్నమండె బాలుర హై స్కూల్‌లో పనిచేసి ఉద్యో గ విరమణ చెందిన పీడీ శ్రీరాములు విద్యార్థులకు ఉచితంగా పల కలు, పెన్నులు, పెన్సిళ్లు వంటి విద్యా సామగ్రిని పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీరాములుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువు కొని ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఉండి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-సుండుపల్లి: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం కాళ్ల మండలంలో ఉండి ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని అందరు చూస్తుండగా చింపివేయటం చాలా దారుణమని మాల మహానాడు ఎపి అధ్యక్షులు బండి ఈశ్వర్ పేర్కొన్నారు. రఘురామ ఎమ్మెల్యేగా గెలుపొందటానికి అన్ని వర్గాల వారు కృషి చేశారని అన్నారు. అంబేద్కర్ ఫ్లెక్సీని చించి వేయటం దళిత జాతిని అవమానించడమేనని అన్నారు.ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన ఉండిఎమ్మెల్యే రఘురామపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలన్నారు.

స్వర్ణాంధ్ర-2047ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన గ్రామ సభలు సక్రమంగా నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర - 2047 దిశగా జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని కడప ఎమ్మెల్యే మాధవి అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం దేవుని కడప టూరిజం ఫంక్షన్ హాల్ ఎదుట గ్రామ సభ నిర్వహించారు. ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే వాటికి పరిష్కార మార్గాలు చూపేవిధంగా సంబంధిత వివిధ శాఖల అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ చంద్రం, టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, ఎద్దుల శంకర్, శ్రీధర్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని బౌద్ధారామం

- రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన అతిథి గృహం
- అభివృద్ధికి ఆమడ దూరంలో ముక్తికనుమ బౌద్ధారామం

ప్రారంభంకానీ బౌద్ధరామ విశ్రాంతి భవనం



బౌద్ధరామాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు ముక్తి కనుమ వద్ద 2017లో అప్పటి ప్రభుత్వం పర్యాటక శాఖ బౌద్ధారామం అభివృద్ధి కోసం రూ. 1.30కోట్లు నిధులు వెచ్చించి పర్యాటక అతిథి గృహం, ధ్యాన మందిరం, సమావేశ మందిరం నిర్మించారు. అతిథి గృహ ప్రాంగణంలో బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. క్రీస్తు శకం 1వ శతాబ్దానికి చెందిన బౌద్ధ రామ స్తూపాలు ముక్తి కనుమలలో ఉన్నాయి.1977 వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగాయి.1979లో ముక్తికనుమపై 21 బౌద్ధ స్తూపాలు బయల్పడ్డాయి. ఆ తర్వాత ప్రభుత్వాలు సరైన ప్రచారం నిర్వహించక పోవడంతో ఈ ప్రాంతానికి తగినంత ఆదరణ లభించలేదు. ఇప్పటికైనా అతిథిగృహం ప్రారంభించి బౌద్ధ స్తూపాలకు ప్రాచుర్యం కల్పిస్తే ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఉంటుందని ఈ ప్రాంతవాసులు అంటున్నారు. అలానే సమీపంలోని అత్యంత ప్రాచుర్యం పొందిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం ఉండడంతో తప్పనిసరిగా ఆలయానికి భక్తులు తాకిడి నెలకొంటుందని స్థానికులు తెలియజేశారు. రాయల సీమలో తక్కువ ఉన్న బౌద్ధ రామాలను అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటక శాఖ పై ఉందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. అతిథి గృహం ప్రారంభమైతే ఈ ప్రాంతం పర్యాటకుల రాకతో ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంత వాసులు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

పీలేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. స్థానిక మాలిక్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 100 రోజులు కూటమి పాలన ఎంతో అద్భుతంగా సాగిందన్నారు. మూడు వేల రూపాయల పెన్షన్ ను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.4వేలు, రూ.6వేలు పెంచడమే కాకుండా ప్రతి నెల ఒకటో తారీకునే ఇంటి దగ్గరకే తెచ్చివ్వడం, అన్న కాంటీన్లు పునఃప్రారంభించి ప్రతిరోజు మూడుపూటల 3వేల మందికి రూ.15 లకే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నా రన్నారు. వరద బాధితులను ఆదుకోవడం, సహాయ చర్యలు చేపట్టడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, దీపావళి నుంచి సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం, ఉచిత ఇసుక పాలసీని తేవడం ఇలాంటి అనేక కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఖాజాబీ, వన్ టౌన్ సీఐ చాంద్ బాషా, అన్ని శాఖల అధికారులు, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాటకొండ గుర్రప్ప నాయుడు, జనసేన నాయకులు జంగాల శివరాం, నాగూర్ వలి, షంషీర్, ఇంతియాజ్, టిడిపి నాయకులు దుబ్బిగాళ్ల భాస్కర్ పాల్గొన్నారు. **పీలేరు:** రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రజలకు సంక్షేమ పథకాల్ని అందివ్వడం ఒక్క ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికే సాధ్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్లే కిషోర్ కుమార్ రెడ్డితోపాటు అధికారులు, కూటమి సభ్యులు, మహిళలు "ఇది మంచి ప్రభుత్వం" కరపత్రాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిని అందించి, ప్రజా సమస్యలే పరమావధిగా వందరోజులు పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, పురం రామ్మూర్తి, జనసేన నాయకులు బెజ వాడ దినేష్, తహశీల్దారు భీమేశ్వరరావు, ఎంపిడిఒ ఉపేంద్ర రెడ్డి పాల్గొన్నారు. **పుల్లంపేట :** ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని ముక్క వారిపల్లి టిటిడి కల్యాణ మండపంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి మాట్లాడు తూ సంక్షోభంలో సంక్షేమాన్ని అందించే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి చంద్ర బాబు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల సువర్ణ పాలన పూర్తయిందని అన్నారు. ప్రజల సమస్యలను స్వయం గా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ప్రజల సమస్యలు వివరించి తక్షణమే సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు మెగా డిఎస్‌సి ఒకేరోజు 65.18 లక్షల మందికి పింఛన్ పంపిణీ, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, పేదల ఆకలి తీర్చడానికి ఐదు రూపాయలకే ఉన్న క్యాంటీన్ ద్వారా భోజనం అందించడం, రైతుల భూములను వారికే ఇవ్వడం కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు లాంటి కార్యక్రమాలు అమలు చేయడం నిదర్శనమని పేర్కొ న్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీర్‌మున్నీ, ఎంపిడిఒ విజయరావు, ఎస్ఐ మహేష్ నాయుడు, యువనాయకుడు సాయివికాస్‌రెడ్డి, తమ్మిద తిరుపాల్, గజపతి, మాజీ ఎంపిపి వెంకటేశ్వరరాజు, తల్లెం రమణారెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక కొట్టాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తంబళ్లపలి టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్ర రెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి సాయినాథ్, అధికారులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేపట్టిన పనులు, అమలు చేసిన పథకాలను వివరించారు. సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు కలికిరిలో 'ఇది మంచి ప్రభుత్వం' : ఎంపిడిఒ

కలికిరి : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ గంగయ్య ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని కలికిరి మేజర్ పంచాయతీ, గుట్టపాలెం పంచాయతీలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఇఒపిఆర్‌డి హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో శనివారం సచివాలయ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఊటుకూరు లోని పలు వీధులలో ర్యాలీ చేపట్టి ప్రజలకు స్వచ్ఛత పై అవగాహన కల్పించారు. పిచ్చిమొక్కలు ఏరివేసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇఒపిఆర్‌డి ప్రతి పౌరుడు స్వచ్ఛతపై అవగాహన కలిగి బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సిసి విశ్వనాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్ మణికంఠ, సచి వాలయ సహాయకుడు వెంకటయ్య, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఒ హబీబుల్లా ఖాన్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పారిశుధ్య కార్మికులు పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పెంచలయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. **వీరబల్లి:** ప్రతి ఇంటి ముందర ఇంకుడు గొంతులు తవ్వుకుంటే పరిశుభ్రంగా ఉండవచ్చని పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని ఎపిడిఒ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈడిగపల్లెలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు తమ ఇల్లు,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, విఒఎలు, డిఆర్‌డిఎ సిబ్బంది ర్యాలీ చేసారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం ఖాదర్‌వలి, సిసిలు నాగేంద్ర,శుభద్రమ్మ, విఒలులు తులసి, కవిత, శ్రీను, మరియమ్మ పాల్గొన్నారు.

రాజంపేట : ర్యాలీ చేపడుతున్న సచివాలయ సిబ్బంది

మండల సమావేశాన్ని అడ్డుకున్న టిడిపి నాయకులు

- మరోసారి వాయిదా వేసిన ఎంపిడిఒ బాలాజీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండల సర్వసభ సమావేశాన్ని శనివారం టిడిపి నాయకులు అడ్డుకున్నారు. ఎంపిడిఇఒ బాలాజీ మండల సర్వసభ్య సమావేశాన్ని రెండోసారి వాయిదా వేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గతంలో వైసిపి నాయకులు అడ్డదారుల తొక్కి ఎంపిటిసిలుగా ఎన్నికయ్యారని, వారికి సమావేశానికి హాజరై అర్హత లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకున్నారని అన్నారు. ఎంపిటిసిలు రాజీనామాలు చేసి తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన అనంతరం మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని సవాల్ విసిరారు. ఎప్పుడు సమావేశం పెట్టాలన్న తాము అడ్డుకుంటామని అన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఆందోళనచేస్తున్న టిడిపి నాయకులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రైతులకు అవగాహన కల్పిస్తున్న జెడి బి.చంద్రనాయక్

ప్రజాశక్తి-కలికిరి

రైతులు సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మెరుగైన దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారి మమతారెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని చీకటిపల్లి గ్రామంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంనకు జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్ పర్యవేక్షణలో వేరుశనగ పంట కోత ప్రయోగంపై రైతు జి.శేషాదర్‌రెడ్డి సర్వే నెంబర్ 21లో 5.5 మీటర్ల ప్లాట్‌లో పంట కోత నిర్వహించగా 1.200 కేజీల దిగుబడి నమోదు చేయడం జరిగిందని తెలిపారు. రెండవ ప్రయోగం సి.సరోజమ్మ సదాశివరెడ్డి సర్వేనెంబర్ 214 -3లో 5.5 మీటర్లు ప్లాట్ లో పంటకోత నిర్వహించగా 0.170 కేజీల దిగుబడి నమోదయిందని తెలిపారు. అనంతరం గుట్ట పాలెం గ్రామంలో ఈ-పంట నమోదు, ఇకెవైసిలను పర్యవేక్షించారు. మండలంలోని రైతులు అందరూ పంట నమోదు, ఇకెవైసిని రైతు సేవా కేంద్రంలో 23వ తేదీ లోగా చేయించుకోవాలని రైతులకు తెలిపారు.యాజమాన్యపద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ వి.రమేష్, ఆర్ఎస్‌కె సిబ్బంది ఎం.నాగేశ్వర్ నాయక్, సతీష్, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం బాల్య వివాహాల పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. భారత దేశంలో వివాహం అనేది ఒక కొత్త తరానికి నాంది లాగా ఉండాలని యువ సంతతి ఆరోగ్యంగా, మానసిక వికాసానికి దేశ అభివృద్ధికి దోహదం చేస్తుం దని అన్నారు. చిన్న వయసులో వివాహం చేస్తే పరిణితి లేక మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే హెల్ప్ లైన్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని ప్రాజెక్ట్ అధికారి అశ్విని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు నాగ నవీన్, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

కాలుష్యాన్ని నియంత్రించాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కాలుష్య నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పర్యావరణం నియంత్రణ అధికారి పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కడప వారి ఆధ్వర్యంలో మాసాపేట, నేతాజీ సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు కాలుష్య నియంత్రణపై కళాజాత రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా మన చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలు ఎలా పరిశుభ్రత చేసుకోవాలి అలాగే ప్లాస్టిక్ కవర్ల వాడితే రానున్న రోజుల్లో ఎలాంటి పర్యావరణ కాలుష్యం అవుతుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం అంటూ వ్యాధుల నివారణ, తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు పాటలు, జానపద గీతాలు, ఇంద్రజాల ప్రదర్శన ద్వారా కళాజాత రూపంలో తెలియ పరిచారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఎంపికకు పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

'మిట్స్'లో ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపికను కళాశాల ప్రాంగణంలో బి.టెక్ మొదటి సంవత్సర విద్యార్థులకు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. చిత్తూరు నుంచి 35 ఆంధ్ర బెటాలియన్ నుంచి సుభేదర్ మేజర్ రాకేష్ లాల్, పర్మనెంట్ ఇన్‌స్ట్రక్టర్ సతీష్ ఆద్వర్యంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. ఇందులో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు ఈ ఎంపికలకు హాజరైనట్లు తెలిపారు. దేహ దారుఢ్య పరీక్షలు, పరుగు పందెం నిర్వహించినట్ల ఆయన అన్నారు. 47 మందిని ఎంపిక చేసినట్టు వీరిలో 20 మంది బాలికలు 27 మంది బాలురు ఉన్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సి పల్ డాక్టర్ సి.యువరాజ్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ డాక్టర్ ఎన్.నవీన్ కుమార్ అభినందనలు తెలిపారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి

ప్రజాశక్తి - కడప : అందరికి న్యాయం అందాలని, న్యాయ వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పోలీస్ పెరేడ్‌లోని మీటింగ్ సమా వేశంలో జిల్లా స్థాయి జుడిషియల్ అధికారుల కాన్ఫరెన్సుపై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ శివశంకర్, ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, ముఖ్య అతిథిగా హైకోర్ట్ జస్టిస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు జస్టిస్ మాట్లాడుతూ పోక్సో ఆక్ట్, డొమెస్టిక్ వైలెన్స్, నేగోషబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్, చైల్డ్ అబ్యూజింగ్ ఆక్ట్‌పై న్యాయవాదులు నిబద్ధతతో చట్టాలను అమలు చేయాలని సూచించారు. న్యాయ సేవను పొందడం ప్రతిఒక్కరీ హక్కన్నారు. చట్టానికి ఎవరూ అతీ తులు కారని, ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా న్యాయాన్నందించే స్వేచ్ఛ, రాజ్యాంగంలోని చట్టాలను కాపా డాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉందన్నారు.

జిఒ 85తో గ్రామీణ ప్రజలకూ నష్టమే

ప్రజాశక్తి - కడప అర్బన్: జీవో నంబరు 85 వల్ల వైద్యులతో పాటు గ్రామీణ ప్రజలకు నష్టమేనని ఆంధ్రప్రదేశ్ పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 85 వల్ల గ్రామాల్లోని పిహెచ్‌సిలలో సేవలందిస్తున్న ఎంబిబిఎస్ వైద్యులు ఉన్నత విద్యకు దూరం అవుతారని చెప్పారు. ఇది వారి హక్కులను కాలరా సినట్టేనని పేర్కొన్నారు. భవిష్యత్తు అంధకారం అయిపోతుందని వాపోతున్నారు. పీజీ వైద్య విద్య చేసిన తరువాత కూడా పిహెచ్‌సిలో పని చేస్తామని వైద్యులు చెప్తున్నా అధికారులు ఆ ప్రతిపాదనను ఒప్పుకోవట్లేదని తెలిపారు. ప్రభుత్వం జీవో నంబర్ 85ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిపిహెచ్‌సి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జెసిబి సీజ్

ప్రజాశక్తి-కలకడ: ఇసుకను అక్రమంగా తరలించడానికి డంపింగ్ చేస్తున్న జెసిబిని సీజ్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలి పారు. మండలంలోని నవాబుపేట పంచా యతీ నవాబుపేట చెరువులో అక్ర మంగా ఇసు కను జెసిబితో డంపింగ్ చేసి తరలించడానికి ప్రయత్నిస్తున్న జెసిబి డ్రైవర్ చలమయ్య పారిపోగా అక్కడే ఉన్న వరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిం చినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ విచారణలో ఇసుకను తరలించడానికి ఎలాంటి ప్రభుత్వ అను మతులు లేవని తెలపడంతో జెసిబిని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పోలీసులు సీజ్ చేసిన జెసిబి